www.ninadam.co.in

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

బుధవారం
22-5- 2024

తెలంగాణ ప్రాంతీయం

పేజీలు : 08

## అనుమతి లేకుండ తాటి, ఈత చెట్లను నరికితే కఠిన చర్యలు

**మహేశ్వరం, మే 21 (నినాదం న్యూస్):** అనుమతి లేకుండా తాటి ఈత చెట్లను నరికితే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్ అన్నారు మంగళవారం ఆమనగల్లు ప్రొహిబీషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల్లో అనుమతి లేకుండ ఈత, తాటి చెట్లను నరికినా, గెలలు కట్ చేసినా వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబడతాయి. తాటి, ఈత వనాల తొలగింపు, చెట్లు, గెలలు కట్ చేయడం చట్ట విరుద్ధమని తెలియదని పేర్కొంటున్నారు, ఇటీవల సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల్లో గీతాకార్మికులు, రైతులు, రియల్ వ్యాపారులకు ఈ విషయమై అవగాహన కల్పించడం జరిగింది. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్దంగా వ్యవరించి తాటి, ఈత వనాలను తొలగించినా, చెట్లు, గెలలను కట్ చేసినా ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఉపాధి కూలీలపై... పట్టింపేది

- సౌకర్యాలు లేమితో.. సతమతం...
- ఎండ వేడిమికి ఇబ్బందులు పడుతున్న కూలీలు
- గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతున్న పనులు
- కనీసం కనిపించని మౌలిక వసతులు

**కోదాడ,మే 20 (నినాదం న్యూస్):**

*ఉపాధి హామీ పనుల వద్ద మౌలిక వసతులు లేకపోవడంతో కూలీలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. పనులు జరిగే వద్ద టెంట్లు ఏర్పాటు చేయకపోవడంతో చెట్ల కింద కూలీలు కొంత సేపు తలదాచుకుని సేద తీర్చుకుంటున్నారు. ఇళ్లల్లో పనులు పూర్తి చేసుకుని ఉదయం 8 గంటలకే ఉపాధి పనులకు వెళ్తున్నారు. టెంట్లు లేకపోవడం, మెడికల్ కిట్లు ఇవ్వకపోవడం, మంచి నీటి సౌకర్యం కల్పించకపోవడంతో కూలీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. ఎండ వేడిమిని తట్టుకోలేక సమీపంలోని చెట్లను ఆశ్రయిస్తున్నారు.*



**పెరుగుతున్న ఎండ తీవ్రత..** ఎండ తీవ్రత పెరుగుతుంది. మంచి నీళ్లు తాగి బాటిల్ అక్కడ పెట్టేలోపే. గొంతు ఆరి తిరిగి దాహం వేస్తుంది. రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పైపైకి పోతున్నాయి. మండుతున్న ఎండల్లో ఉపాధి పనులు చేయాలంటే కూలీలు నానా అవస్థలు పడుతున్నారు. పనులు చేసే చోట సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శిస్తున్నారు. గ్రామాల్లో కూలీల వలసల నివారణకు గాను 2005లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కూలీలకు ఉపాధి కల్పించేందుకు సంవత్సరంలో 100 రోజులు పనులు కల్పిస్తున్నారు. కూలీల వేతనాలు కూడా పెంచారు. కానీ పనుల వద్ద మాత్రం సౌకర్యాలు కల్పించకపోవడంతో ఉపాధి కూలీలు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. పనులకు ఉపయోగించే పారలు, గడ్డపారలు తదితర వస్తువులను పనులకు వెళ్లే కూలీలే తీసుకెళ్లి పనులు అవగానే తిరిగి ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. అంతే కాకుండా పనుల వద్ద తగిన సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారులు విమర్శలపాలవు తున్నారు. మౌలిక వసతులు లేక ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటు న్నారు. మంచి నీళ్లు కూడా కూలీలు ఇంటి వద్ద నుండి బాటిల్స్ తెచ్చుకుని తాగుతున్నారు. టెంట్లు, మంచి నీళ్ల ఏర్పాటుకు నిధుల కొరతే కారణమని అధి కారులు అంటున్నారు. కానీ కూలీలు పడుతున్న ఇబ్బందులు మాత్రం గుర్తించడంలేదు.

**జిల్లాలో 2,61,106 జాబ్ కార్డులు...**

సూర్యాపేట జిల్లాలోని 23 మండలాల్లో 475 గ్రామాల్లో రెండు మాసాలుగా ఉపాధి పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఏప్రిల్, మే మాసాల్లో పనులు మరింత వేగవంతం కానున్నాయి. ఈ నేపథ్యంలో పనుల వద్ద సౌక ర్యాలు కల్పించకపోవడం సరైంది కాదని కూలీలు అంటు న్నారు. ఇదిలా ఉండగా పనులకు వచ్చే కూలీల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేందుకు గాను నూతన సాంకేతిక పద్దతిని అవలంభిస్తున్నారు. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా పనులకు హాజరైన వారి వివరాలు పోర్టల్లో నమోదు చేస్తారు. జిల్లాలో 2,61,106 మంది కూలీలకు జాబ్కార్డులు ఉన్నట్లు అధికారులు పేర్కొ న్నారు. వేతనాలు కూడా రూ.257 నుండి రూ.272లకు పెంచారు. పెంచిన రూ.15 గత ఏడాది ఏప్రిల్ మాసం నుండి అమలు చేస్తున్నారు. కనీసం పనుల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం లేదు. మెడికల్ కిట్లు సైతం అందజేయడం లేదని కూలీలు అంటున్నారు. ఎండల కు పని చేస్తున్న నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అధికారులు అందుబాటులో ఉంచాలి. ప్రస్తుతం గ్రామాల్లో కుంటలు, చెరువుల్లో పూడిక తీత పనులు, హరితహారంలో నాటిన మొక్కల సంర క్షణ, నర్సరీల నిర్వహణ, ఫీడర్ ఛానెల్ పనులు, రహదా రులకు ఇరువైపులా కంపచెట్ల తొలగింపు, కందకాలు తవ్వడం తదితర పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

జాబ్కార్డు తీసుకున్న కూలీలంతా పనులకు వెళ్తూ ఎంత పని చేశారో ఎప్పటికప్పుడు మస్టర్లలో నమోదు చేయించు కుంటున్నారు. ఎండలు తీవ్రమవడంతో కూలీలు వ్యవసాయ పనులకు వెళ్లడం లేదు. ఉదయం వేళల్లోనే ఉపాధి పనులు పూర్తి చేసుకుని ఇంటి ముఖం పడుతు న్నారు. ప్రభుత్వం ఫీల్డ్ అసి స్టెంట్లను తిరిగి నియమించడంతో గ్రామాల్లో ఉపాధి పనులను మరింత వేగవంతం చేశారు. సౌకర్యాలను మాత్రం కల్పించకపోవడంతో కూలీలు ఇబ్బందులు పడు తున్న నేపథ్యంలో అధికారులు స్పందించి టెంట్లు, మంచి నీరు, మెడికల్ కిట్ల తదితర మౌళిక సౌకర్యాలు కల్పించాలని పలువురు కూలీలు కోరుతున్నారు.

**పనులు కలిపించకపోవడంలో అలసత్వం..**

అనంతగిరి మండలంలోని పలు గ్రామాలలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని, ఆయా గ్రామాల ప్రజల ఆరోపిస్తున్నారు. పనులు కల్పించే విషయంలో గ్రామాలలో ఏకపక్షంగా కొన్ని గ్రూపులకు మాత్రమే పని కల్పిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టిఆర్ఎస్ ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లను విధులు నుండి తొలగించి పంచాయతీ కార్యదర్శులకు ఆ బాధ్యతల అప్పగించింది. కానీ వారిని విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టు సంఘాలతో పాటు అన్ని సంఘాలు మద్దతు తెలపడంతో ప్రభుత్వం తన నిర్ణయం వెనక్కి తీసుకొని తిరిగి వారిని వీధుల్లోకి తీసుకుంది. విధుల్లో చేరిన ఫీల్డ్ అసిస్టెంట్ల మాత్రం తమ పద్ధతిని మార్చుకోకుండా గ్రామాలలో గ్రామస్థాయి అధికారులతో కలిసి ఇష్టానుసారంగా పనులు చేయిస్తున్నారని గ్రామస్తుల నుండి బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవ కోరవడింది . దీంతో గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పని నమ్ముకుని జీవనం కొనసాగించాలనుకుంటున్న కూలీలకు ఇబ్బందికర పరిస్తితులు ఏర్పడుతున్నాయి... ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో ఉపాధి హామీ పనులపై నిఘా ఉంచాలని, ప్రతి ఒక్కరికి పని కల్పించేలా ప్రణాళికలో ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**ఉపాధి హామీ కూలీలకు వసతులు కల్పించాలి...**

**సిపిఐ మండల కార్యదర్శి, బద్దం కృష్ణారెడ్డి...**



అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయిలో పర్యటించి గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీల సమ్యలు పరిష్కరించాలి. కూలీలకు పనిచేసే ప్రదేశాల్లో తాగు నీటితో పాటు సేద తీరడానికి టెంటు, అదే విధంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టె వంటి కనీస సౌకర్యాలు కూడా కల్పించాలి. చాలా మంది కూలీలకు జాబ్ కార్డులు లేవని వారు పని చేసినా వారి ఖాతాలో డబ్బులు జమ కావడం లేదన్నా రు. వెంటనే కొత్త జాబ్ కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. పని చేస్తున్న కూలీలకు రూ.10 లక్షల ఇన్సూరెన్స్ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

**మల్లాపూర్, మే 21 (నినాదం న్యూస్) :** మండల కేంద్రంలోని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు మండల కేంద్రంలోని కెఎంఆర్ గార్డెన్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు . ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చిన్ననాటి మధురమైన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అనంతరం సహంపక్తి భోజనాలు చేశారు. ఇక్కడ పూర్వ విద్యార్థులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కదుర్క నర్సయ్య, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, మాజీ సర్పంచ్ లు ధ్యాగ గంగారెడ్డి, సరికేల మహిపాల్, కాంగ్రెస్ సేవా దళ్ మండల అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు క్యాతం శ్రీనివాస్ రెడ్డి, నల్ల రమేష్ రెడ్డి, పెరుమాండ్ల రాజేందర్, ఎండి బాబా, మాట్ల శ్రీనివాస్, ఎండి రఫీ, గఫార్, పిలేరి రాము తదితరులు పాల్గొన్నారు

## పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఆర్డీవో...




**కోదాడ,మే 21 (నినాదం న్యూస్):** అనంతగిరి మండలంలోమీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు విషయంపై తహసిల్దార్ రవికుమార్ కు పలు సూచనలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆర్డిఓ పోలింగ్ కేంద్రాల తనిఖీ చేపట్టారు. ఓట్లు వేయడానికి వచ్చిన వాళ్ళకి ఎటువంటి ఇబ్బంది జరగకుండా చూసుకోవాలని చెప్పారు. మంచినీరు, విద్యుత్ సరఫరా, తదితర విషయాలలో జాగ్రత్త వహించలని సూచించారు. వారి వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.